పల్లెల్లో సందడి!

పంచాయతీ పోరుకు సన్నాహాలు

పంచాయతీ ఎన్నికలకు అధికార యంత్రాంగంతో పాటు రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతున్నాయి. 15వ తేదీలోగా నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెండు రోజుల కిందట సంకేతాలు ఇవ్వడంతో గ్రామాల్లో రాజకీయ సందడి మొదలైంది. సర్పంచ్, వార్డు అభ్యర్థుల ఎంపికపై ఆయా పార్టీలు ఇప్పటికే కేడర్‌తో మంతనాలు జరుపుతున్నాయి. పార్టీల గుర్తులతో సంబంధం లేకుండా ఈ ఎన్నికలు జరగనున్నప్పటికీ అన్ని పార్టీలు సవాల్‌గా తీసుకుంటున్నాయి. మరో వైపు పంచాయతీ ఎన్నికలు జరిగే వరకు పంచాయతీ కార్యదర్శులకు సెలవులు రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,168 పంచాయతీలున్నాయి.



- ఎన్నికల నోటిఫికేషన్‌పై ప్రభుత్వ సంకేతాలు
- సన్నద్ధమవుతున్న రాజకీయ పార్టీలు
- పంచాయతీ కార్యదర్శులకు సెలవులు బంద్
- అత్యవసరమైతే ఆధారపత్రాలుంటే మంజూరు
- రిజర్వేషన్లపై సర్వత్రా నెలకొన్న ఆసక్తి
- అధికార పార్టీకి సవాల్‌గా స్థానిక ఎన్నికలు



రంగారెడ్డి కలెక్టరేట్‌కు చేరిన పోస్టల్ బ్యాలెట్ పత్రాలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): స్థానిక ఎన్నికల నిర్వహణకు దాదాపు మార్గం సుగమమం కావడంతో ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. బీసీ రిజర్వేషన్ల ప్రకటన తర్వాతనే ఎన్నికలు నిర్వహిస్తామని ఇంతకు ముందు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కులగణనపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందింది. దీన్ని నేడు అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అలాగే ఎస్సీ వర్గీకరణపై కూడా ప్రభుత్వం అసెంబ్లీలో నివేదిక పెట్టేందుకు సిద్ధమైంది. ఈ రెండు నివేదికలను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అనంతరం ఇందుకు అనుగుణంగా రిజర్వేషన్లు ఖరారు చేసి పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. దాదాపు ఇందుకు సంబంధించిన కసరత్తు అధికార యంత్రాంగం దాదాపు పూర్తిచేసింది. అలాగే ఎన్నికలు జరిగే వరకు పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం సెలవులు రద్దు చేసింది. అత్యవసర పరిస్థితుల్లో తగిన ఆధారాలు చూపిన వారికి మాత్రమే నిబంధనల మేరకు సెలవులు మంజూరు చేయాలని ఆదేశించింది. ముందస్తు

మూడు జిల్లాల వివరాలు

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు
రంగారెడ్డి	21	549	4,896
మేడ్చల్	3	34	320
వికారాబాద్	18	585	4,982

మిగతా 7వ పేజీలో...



పతకాలతో బాలురు, మహిళల జట్ల కెప్టెన్లు

లంగాడి క్రీడలో బాలుర జట్టుకు గోల్డ్ మెడల్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం పరమకుడిలోని కవినా ఇంటర్నేషనల్ స్కూల్‌లో 14వ సీనియర్, 13వ సబ్ జూనియర్ జాతీయ లంగాడి చాంపియన్‌షిప్ పోటీలను జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహించారు. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలారం ప్రభాకర్ తెలిపారు. సీనియర్స్‌లో పురుషులు, మహిళల జట్లు, సబ్‌జూనియర్స్‌లో బాలుర జట్లు పాల్గొన్నాయి. సబ్‌జూనియర్ బాయ్స్ ఫైనల్‌లో తెలంగాణ టీం మహారాష్ట్రపై 10 పాయింట్లతో గెలిచింది. సబ్ జూనియర్స్‌లో కెప్టెన్ బన్నీ, చందు, రాజ్‌కుమార్, సులేమాన్, ప్రజ్వల్, కిషోర్, నిఖిల్ జట్టు విజయానికి తోడ్పడ్డట్టు తెలిపారు. తెలంగాణ పురుషుల టీం కెప్టెన్‌గా విజయ్, మహిళల టీం కెప్టెన్‌గా ప్రియాంక వహించారు. ఈ రెండు జట్లు కాంస్య పతకానికి గోవాతో తలపడి గెలిచాయి. బాలుర కోచ్ మేనేజర్లుగా వేముల మహేశ్వరీ, గద్వాల చైతన్య, పురుషుల జట్టు కోచ్ మేనేజర్లుగా పాలాది పరమేశ్, మహేందర్ వ్యవహరించారు. క్రీడాకారులు పతకాలు సాధించడంపై లంగాడి అసోసియేషన్ చైర్మన్ శివశంకర్, తుంకూర్ సంతోషాన్ని వ్యక్తం చేసి క్రీడాకారులను అభినందించారు.

నయనానందకరం
శ్రీవారి కల్యాణం
శెట్టిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు 6



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నులిపురుగు నివారణ మాత్రలు వేయాలి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఒకటి నుంచి 19ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలందరికీ ఈ నెల 10న నులి పురుగుల నివారణ మాత్రలు తప్పకవేయించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాతుడూ.. నులి పురుగులతో పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందని, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి రుగ్మతలకు లోనవుతారన్నారు. ఆహారం ఎక్కువగా తీసుకోలేరని, తిన్న ఆహారం కూడా సరిగా జీర్ణం కాదన్నారు. ఈ సమస్యల నిరవారణకు ప్రభుత్వం యేటా రెండుసార్లు నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేస్తోందన్నారు. ఫిబ్రవరి 10న అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, అన్ని విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేసేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో మాత్రలు వేసే వయస్సున్న పిల్లలు 60,696 మంది ఉన్నారని, వారందరికీ అల్బెండజోల్ ట్యాబ్స్ వేయాలని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు అల్బెండజోల్ గోలీలు వేయించేలా చూడాలని, గ్రామాల్లో చాటింపు చేయించాలన్నారు. మాత్రలు వేసే రోజు విద్యార్థులు తప్పక హాజరయ్యేలా చర్యలు తీసుకొని వంద శాతం విజయవంతం చేయాలన్నారు. ఒకటి నుంచి రెండేళ్ల పిల్లలకు అన్నం తిన్న తరువాత సగం టాబ్లెట్ పొడి చేసి, రెండేళ్ల నుంచి మూడేళ్ల పిల్లలకు ఒక టాబ్లెట్ పొడి చేసి, 3-19ఏళ్ల పిల్లలకు ఒక మాత్ర నమిలి మింగేలా వేయాలన్నారు. మాత్ర వేయగానే నీటిని తాగించాలన్నారు. వైద్య, విద్య, ఐసీడీఎస్, సంక్షేమ శాఖల అధికారులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'బసంత్' వేడుక నిర్వహణ అభినందనీయం

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతంలో కొన్ని సమస్యలపై పలు సమాజాల మధ్య ఘర్షణలు జరుగుతున్న తరుణంలో సంప్రదాయ 'బసంత్ ఫెస్టివల్' నిర్వహణకు ముజఫ్ఫర్ అలీ సూఫీ చేసిన కృషి గొప్పదని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకులు సీఎస్.రంగరాజన్ అన్నారు. హైదరాబాద్ పాతబస్తీలోని చారిత్రక హజ్రత్ షేక్‌జీ అలీ దర్గాలో సూఫీ సాధువులు నిర్వహిస్తున్న బసంత్ ఫెస్టివల్‌లో సోమవారం రంగరాజన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఉత్తర భారతదేశంలో సూఫీ దర్గాల్లో బసంత్ వేడుకలు జరుపుకోవడం ఆచారమే అని, కానీ దక్షిణాన ఈ పండుగను అరుదుగా నిర్వహిస్తారని అభిప్రాయపడ్డారు. ఈ వేడుకను పూర్వ హైదరాబాద్ కుతుబ్ షాహీలు, అసఫ్ జాహీలు నిర్వహించేవారని గుర్తుచేశారు. ఇప్పుడు సూఫీ సంప్రదాయాన్ని పునరుద్ధరించిన ముజఫ్ఫర్ అలీ అభినందనీయులన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్ పాల్గొన్నారు.



బసంత్ ఫెస్టివల్‌లో పాల్గొన్న రంగరాజన్, సూఫీలు

బిల్లు కోసం గెస్ట్‌హౌస్ గేట్‌కు తాళం

- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



గేటుకు తాళంవేసి బైఠాయించిన కాంట్రాక్టర్ దానయ్య

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తనకు రావాల్సిన బిల్లులు ఇప్పించాలని ఓ కాంట్రాక్టర్ సోమవారం ఇబ్రహీంపట్నంలో జడ్పీ అతిథి గృహానికి(ప్రసుత్త తహసీల్దార్ కార్యాలయం) తాళం వేసి నిరసన వ్యకం చేశారు. నాలుగేళ్లుగా తన పెండింగ్ బిల్లులు ఇవ్వండం లేదని వాపోయారు. ఉదయం 10గంటల ప్రాంతంలో కాంట్రాక్టర్ దానయ్య ఆఫీసు గేటుకు తాళం వేసి గేటు వద్ద బైఠాయించాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అతడిని స్టేషన్‌కు తరలించడంతో వివాదం సద్దుమణిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం ముందు 11ఏళ్ల క్రితం రూ.50లక్షలతో జెడ్పీ గెస్ట్‌హౌస్‌ను నిర్మించారు. కాంట్రాక్టర్ దానయ్య స్లాబులు వేసి గోడలు కట్టాడు. మిగతా పనులకు ఉత్తర్వులు లేకున్నా కాంట్రాక్టర్ పనులు పూర్తిచేశాడు. ఎమ్మెల్యే చెబితేనే తాను పనులు చేశానని, ఇప్పుడు బిల్లు ఇవ్వడం లేదని దానయ్య నిరసన వ్యక్తం చేయగా ఈ వివాదానికి తెరలేసింది. ఇదిలా ఉంటే ఇక్కడే శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్ ఆఫీసును కూల్చి కొత్తగా నిర్మిస్తున్నందున తాత్కాలికంగా తహసీల్దార్ కార్యాలయాన్ని నూతన జడ్పీ గెస్ట్‌హౌస్‌లో కొనసాగిస్తున్నారు. దీంతో బిల్లుల కోసం కాంట్రాక్టర్ ఆందోళన చేశాడు. బిల్లుల విషయమై పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి వివరణ ఇస్తూ.. జడ్పీ గెస్ట్ హౌస్ నిర్మాణానికి మంజూరు ఉన్నంత వరకు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించామని తేల్చి చెప్పారు.



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న సాజియా

ధరణిలో రైతుల పేర్లను నమోదు చేయాలి

యాచారం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితా నుంచి పట్టా భూములను తొలిగించి రైతుల పేర్లను నమోదు చేయాలని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుడు ఎండీ సాజియా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. సోమవారం ఢిల్లీలో ఎంపీని కలిసి ధరణితో సమస్యలపై వివరించారు. రైతులు భూముల క్రయవిక్రయాలు జరుపుకునేలా వీలు కల్పించాలని కోరారు. మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులను ఆదుకోవాలని కోరారు.

ప్రజావాణికి 62 ఫిర్యాదులు



సమస్య వింటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 62 ఫిర్యాదులొచ్చాయి. రెవెన్యూ శాఖ నుంచి అత్యధికంగా 44, ఇతర శాఖల నుంచి 18 ఫిర్యాదులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని నుంచి కలెక్టర్ నారాయణరెడ్డి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫిలింసిటీలో ఇళ్ల స్థలాలివ్వాలి

రామోజీ ఫిలిం సిటీలో పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం రామోజీ ఫిలిం సిటీలో 677 మంది పేదలకు 60 గజాల చొప్పున కేటాయించిన ఇళ్ల స్థలాలకు వెంటనే పొజిషన్ చూపాలని కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్, జగన్, ఇతర నాయకులు బుగ్గ రాములు, జంగయ్య, జగన్, నరసింహ, నాందన్, రాయపోల్, భిక్షపతి, అశోక్, కరుణాకర్‌రెడ్డి, ఎ.రాములు, యాదయ్య, దనేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడం చట్ట విరుద్ధం

రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం పేదలను అడ్డుకోవడం చట్ట విరుద్ధమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య అన్నారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. రామోజీ ఫిలింసిటీలో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో నాగవల్లి, పొల్కంపల్లి, రాయపోలు, ముకునూరు గ్రామాల్లోని వందలాది పేదలకు గతంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి సర్టిఫికెట్లు ఇచ్చి పొజిషన్ సైతం చూపిందన్నారు. కానీ ఆ స్థలాల్లో ఇండ్ల నిర్మాణాన్ని ఫిలింసిటీ యాజమాన్యం అడ్డుకుంటోందన్నారు. ఈ విషయంలో పేదలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా నాయకులు ములుగు నర్సింహ, శివకుమార్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో శంకర్‌పల్లి మున్సిపాలిటీ

ఐదేళ్లలో ఎన్నో ప్రజోపయోగ పనులు



భారీ ప్రణాళికతో హైదరాబాద్ రోడ్డులో నిర్మిస్తున్న వరద కాలువ

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. తాజా మాజీ పాలకవర్గ సభ్యుల సహకారంతో సుమారు రూ.92.13కోట్లతో పట్టణంలోని 15 వార్డులను అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపారు. గత కౌన్సిల్ ఐదేళ్ల పాలనలో పెద్దఎత్తున నిధులు తెచ్చి పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. తాజా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో వెల్లువలా పనులను చేపట్టారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ 2018 ఆగస్టులో ఏర్పడింది. ఎన్నికల అనంతరం 2020 జనవరి 25న పాలకవర్గం పదవిలోకొచ్చింది. ఈ పురపాలిక జనాభా 2011 లెక్కల ప్రకారం 21వేలుండేది. 15 వార్డుల ఈ మున్సిపాలిటీ మొదట్లో సమస్యలతో సతమతమయ్యేది. దీంతో చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రత్యేక శ్రద్ధ వహించి ఎమ్మెల్యే సహకారంతో పట్టణాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లారు. నియోజకవర్గంలో ఒకేఒక్క మున్సిపాలిటీ ఉండటంతో ఎమ్మెల్యే యాదయ్య సైతం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి భారీగా నిధులు సమకూర్చారు. మున్సిపాలిటీ పరిధి సింగాపురం, బుల్కాపురం, రామంతపురం, చిన్నశంకర్‌పల్లి, పత్తేపురాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు

మిగతా 8వ పేజీలో...

టీయూఎఫ్ఐడీసీ నిధులతో రోడ్లు

రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.37.58 కోట్లు మంజూరవగా పట్టణంలో సీసీ రోడ్డు, బీటీ రోడ్డు, మురుగుకాలువల నిర్మాణ పనులు కొన్ని వార్డుల్లో పూర్తయ్యాయి. మరికొన్ని వార్డుల్లో కొనసాగుతున్నాయి. బీడీఎల్ చౌరస్తా నుంచి తీగలవాగు వరకు రోడ్డుకు రెండు వైపులా వర్షం నీరు సాఫీగా వెళ్లేందుకు చేపట్టిన వరదకాలువల పనులు పూర్తికావచ్చాయి. పట్టణంలోని సంగారెడ్డి రోడ్డు నుంచి సింగాపురం వరకు రెండు లేన్ల రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. అలాగే చేవెళ్ల రోడ్డు నుంచి రామంతాపురం వరకు సీసీ రోడ్డు, అంబేడ్కర్ విగ్రహం నుంచి సాయికాలనీ వరకు సీసీ రోడ్ల పనులు పూర్తయ్యాయి. దీంతో ప్రజలకు సౌలభ్యం కలిగింది.

శంకర్‌పల్లి చౌరస్తా.. జిగేల్..జిగేల్!



శంకర్‌పల్లి ఇంద్రారెడ్డి చౌరస్తా నుంచి బుల్కాపురం వరకు నాలుగు వరుసల రోడ్డులో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. దాంతో శంకర్‌పల్లి నుంచి బుల్కాపురం వరకు గల హైదరాబాద్ రోడ్డు రాత్రివేళ జిగేల్‌మంటున్నది. సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుతో పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు తీరాయి.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

- కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి : డీసీసీ అధ్యక్షుడు చల్లా డిమాండ్
- కలెక్టరేట్ వద్ద నాయకుల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయంపై బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు ఊరూరా అడ్డుకోవాలని డీసీసీ అధ్యక్షుడు, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు సోమవారం కాంగ్రెస్ నేతలు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. చల్లా మాట్లాడుతూ.. బడ్జెట్‌లో తెలంగాణ ఊసే లేదన్నారు. రాష్ట్ర బీజేపీ ఎంపీలు వేస్ట్ అన్నారు. కేంద్ర నిధులు రాబట్టడంలో విఫలమైన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్ ప్రజలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయంపై బీఆర్ఎస్ ప్రశ్నించడం లేదని, బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటేనన్నారు. 8మంది బీజేపీ ఎంపీలనిచ్చినా తెలంగాణకు ప్రధాని మోదీ ద్రోహం చేశారన్నారు. ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులున్న ప్రయోజనం సున్నా అన్నారు. రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి మాట్లాడుతూ మూసీ నది ప్రక్షాళనకు అడ్డుపడుతున్న బీజేపీ ఎంపీలు బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై స్పందించడం లేదన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ కేంద్రం మోసంపై ఢిల్లీలోని జంతర్‌మంత్ వద్ద ధర్నా చేయాలన్నారు. ధర్నాలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, ఎం.రామ్మోహన్‌గౌడ్, వేణుగౌడ్, మల్లేష్, గుర్నాథ్‌రెడ్డి, వేణుగౌడ్, భాస్కర్, డి.భాస్కర్‌రెడ్డి, జె.ప్రభాకర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ పారిజాత, శాలిని, శేఖర్‌మామ, కిషన్, శేఖర్‌యాదవ్, సమత, సుగుణ, హర్షలత పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాల్సిందే

● బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

● పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు వికారాబాద్ పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ తెలంగాణ ఎంపీలు రాజీనామా చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. స్థానికంగా బీజేపీ ఉన్న ఈ ప్రాంతానికి వచ్చింది ఏమీ లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని మండి పడ్డారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, చిగుళ్లపల్లి రమేష్ కుమార్, సురేష్, అనంత్‌రెడ్డి, శ్రీను ముదరాజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సాయంత్రం 4.30 గంటలకు నిరసన నిర్వహించాలని నాయకులు నిర్ణయించారు. రాంమోహన్‌రెడ్డి సరైన సమయానికి అక్కడికి చేరుకున్నా గానీ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వికారాబాద్‌లోని వెంకటాపూర్ తండాలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారని, దీంతో ఈ కార్యక్రమం ఆలస్యమైందని పార్టీ నేతలు చర్చించుకున్నారు.



వికారాబాద్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్రం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం ఆసన్నమైందని, ఈ ఎలక్షన్‌లో అత్యధిక స్థానాలు గెలుచుకునేందుకు కాంగ్రెస్ నాయకులు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. సోమవారం తుక్కుగూడ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్న ఆశావహులందరికీ మంచి రోజులొచ్చాయన్నారు. మరో రెండు వారాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందన్నారు. పోటీ చేసే నాయకులు తగిన ఏర్పాట్లను చేసుకోవాలన్నారు. మున్సిపల్ ఎన్నికలు కాస్తా ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నందున ముందుగా పంచాయతీ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసే నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాల్లోని ప్రజలకు అందేలా చూడడంతో పాటు వాటిని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జనాభాలో సగం బీసీలు ఉన్నందున వారికి రిజర్వేషన్‌ల కోటా పెంచేందుకే కులగణన సర్వే చేసినట్లు చెప్పారు. సర్వేలో 46.25 శాతం తేలిందన్నారు. జనాభా దామాషా ప్రకారం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయింపులుంటాయన్నారు. టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

● మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

● ప్రజలను మోసగించిదంటూ విమర్శ

ఆమనగల్లు , ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చాక అమలులో విఫలమైన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ , కేంద్రంలోని బీజేపీ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ బీఆర్ఎస్ శ్రేణులంతా ప్రజల పక్షాన పోరాటాలు సాగిస్తూ స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఆమనగల్లు మున్సిపాలిటీ చంద్రాయన్‌పల్లి తండాలో సోమవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తండాలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. చంద్రాయన్‌పల్లి తండా, శ్రీరామ్ నగర్ తండాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పత్యానాయక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జైపాల్ యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా తండాలో ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంద ఎకరాల్లో పశుగ్రాసం దగ్ధం


నక్కగుట్టతండా వద్ద మంటలు ఆర్పుతున్న పోలీసులు

యాచారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలం నక్కగుట్టతండాలో సోమవారం మధ్యాహ్నం పశుగ్రాసం దగ్ధమైంది. మంటలు అంటుకొని వంద ఎకరాల్లో ఉన్న భూముల్లోని గ్రాసం దగ్ధమైంది. ఇది గుర్తు తెలియని దుండగులు పనేనని స్థానిక రైతులు వాపోయారు. రోడ్డు వెంట వెళ్తున్న యాచారం పెట్రోమొబైల్-2 పోలీసులు గమనించి వెంటనే ఇబ్రహీంపట్నంలో ఉన్న ఫైరింజన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఇక్కడికి చేరుకొని మంటలను ఆర్పారు. ఆ మేరకు ఎండాకాలం అంతా పశువులకు మేత కొరత ఉండేది కాదని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. తమకు ప్రభుత్వం సాయం చేయాలని కోరుతున్నారు.

పాఠశాలల సమయానికే బస్సులు నడపాలి

● ఆర్టీసీ డీఎంకు వినతి


ఆర్టీసీ డీఎంతో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి

యాలాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల సమయానికే బస్సులు నడపాలని యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం తాండూరు ఆర్టీసీ డీఎంను ఆయను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సమయానికి బస్సులు లేకుండా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దౌలాపూర్, తిమ్మాయిపల్లి, బండమీదిపల్లి, బెన్నూరు, జక్కేపల్లి, లక్ష్మీనారాయణపూర్ తదితర గ్రామానికి చెందిన విద్యార్థులు అగ్గనూరు జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్నారన్నారు. ఈ గ్రామాల విద్యార్థులందరూ లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాకు వచ్చి బస్సుల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. త్వరితగతిన తాండూరు నుంచి అగ్గనూరు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని డీఎంను కోరారు. సాయంత్రం వేళల్లోనూ అదనంగా అగ్గనూరు నుంచి లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా వరకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. సానుకూలంగా స్పందించిన డీఎం... పాఠశాలల సమయానికి బస్సులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

నయనానందకరం శ్రీవారి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు , హాజరైన భక్తులు

● భారీగా తరలొచ్చిన భక్తజనం

● పాల్గొన్న పలువురు ప్రముఖులు

ఆమనగల్లు , ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అలివేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఆలయాన్ని, కల్యాణ మండపాన్ని శోభాయామానంగా అలంకరించారు. కాగా, స్వామి వారి మూలవిరాట్లను ఆలయం నుంచి మండపానికి మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవిసత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ కోట్ల జగన్మోహన్, అర్చకులు గూడ కృష్ణమాచార్యులు పూర్ణకుంభంతో కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. మేళతాళాలు, వేద మంత్రాల నడుమ స్వామి వారి కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలొచ్చారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి , రాష్ట్ర కాలుష్య నియంత్రణమండలి సభ్యుడు బాలాజీ సింగ్ సైతం హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్ రావు, రాష్ట్ర కాలుష్యనియంత్రణ మండలి సభ్యుడు బాలాజీ సింగ్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సింగం జంగయ్య, సింగం శ్రీనయ్య, వెంకటయ్య, వెంకటేశ్, భవాని ,రోహిత్, బాస్కర్ రావు, నర్సింహ, మహేశ్, వంశీ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.


కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

బోధన తీరులో మార్పు రావాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : మారుతున్న విద్యావిధానంతో పాటు అధ్యాపకులు బోధించే బోధనలో మార్పు రావాలని నేపాల్‌కు ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ శ్రేష్ఠ తెలిపారు. కాచవానిసింగారంలో ఉన్న నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం జరిగిన డిజిటలైజేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు అత్యుత్తమ బోధన, శోధన విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి ప్రాతిపదికన ఈ సదస్సులో ఒప్పందాలు జరిగాయన్నారు. బోధన, శిక్షణలతో డిజిటలైజేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఈ సదస్సు ముఖ్య లక్ష్యమన్నారు. అధ్యాపకులు విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో బోధన చేయాలని సూచించారు. సంస్థకు అవసరమయ్యే పరిశోధనలు విద్యార్థులు చేయాలని, అందుకు తగిన విధంగా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఐదు రోజుల పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ నల్ల దివ్యా, ప్రొఫెసర్లు రిషబోఖానాల్, సరోజ్ శ్రేష్ఠ, రూపర్డ్ బవానార్, లేజియన్ వాస్కలిన్, షాలిని బేరియార్, సతీష్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

» జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురాన్‌పూర్ గ్రామంలో రూ.61 లక్షలతో పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ ప్రాంతంపై ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, నర్సిములునాయుడు, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, భీమయ్యగౌడ్, నర్సిములుయాదవ్, దేశ్యానాయక్, మహిపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంటేకార్ భగీరథ్

'వైఫల్యాలు కప్పిపుచ్చేందుకే కుట్ర రాజకీయాలు'

కడ్తాల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కుట్రరాజకీయాలు సాగిస్తోందని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కాంటేకార్ భగీరథ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం, అంబేద్కర్ విగ్రహాల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం వారి అవకాశ వాద రాజకీయాలకు నిదర్శనమన్నారు. కడ్తాల మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భగీరథ్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు సమన్యాయం చేసేలా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు అవగాహన లేకుండా బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్‌ను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. సమావేశంలో బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు సురేశ్ నాయక్, కార్యదర్శి మల్లేశ్ నాయక్, నాయకులు కళ్యాణ్, ఉమేశ్, సాయి, అభి, ఆనంద్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



వసంతి పంచమి వేడుకల్లో డీన్ రామారావు తదితరులు

ఘనంగా వసంత పంచమి వేడుకలు

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): ప్రకృతిపరమైన చైతన్య ప్రకాశానికి సరస్వతీదేవి మనో వికాసానికి ప్రతీక అని ఎన్టీఆర్ విద్యా సంస్థల డీన్ రామారావు అన్నారు. మొయినాబాద్ మండలంలోని ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో రెండు రోజులుగా వసంతి పంచమి వేడుకలు, సరస్వతీ పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో బీఆర్‌ఎస్ నాయకులు

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన నేతలు

కొడంగల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కొడంగల్ మండలం అంగడిరైచూర్‌కు చెందిన నర్మద కిష్టప్ప కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నాయకత్వంలో పని చేస్తూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సూచించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



దేవాలయ మండపం, స్వామి వారి మూలవిరాట్టు

బ్రహ్మోత్సవాలకు వేళాయె

చెన్నకేశవ స్వామి ఆలయం ముస్తాబు

» ఎనిమిది నుంచి ప్రారంభం.. ఏడు రోజుల పాటు నిర్వహణ

» మౌలిక సదుపాయాల కల్పనలో నిమగ్నం

కడ్తాల్ , ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన కడ్తాల మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. యేటా ఈ దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆ మేరకు ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ఉత్సవాల కోసం ఆలయ నిర్వాహకులు మౌలిక సదుపాయాల కల్పనలో నిమగ్నమయ్యారు. కాగా, అర్చకుడు మెళ్లారి వెంకటేశ్వర శర్మ పర్యవేక్షణలో వేడుకలు జరగనున్నాయి. కడ్తాల, తలకొండపల్లి, కందుకూరు, ఆమనగల్లు, కేశంపేట, యాచారం, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం తదితర ప్రాంతాల నుంచి బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఏడు రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు గావించారు.

కనులపండువగా లక్ష్మీ చెన్నకేశవ కల్యాణం

తలకొండపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయాలలో సోమవారం స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాగా నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేశ్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మలాశ్రీశైలం గౌడ్ హాజరయ్యారు. అర్చకుడు మహేశ్ ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ లలితాజ్యోతయ్య, నాయకులు, భక్తులు తుమ్మ నర్సింహ, యాదయ్య, యాదగిరి, పాండు, పురుషోత్తం, సురేశ్, వెంకటేశ్, రాములు, పాపయ్య, ప్రవీణ్, మల్లేశ్, వెంకటయ్య పాల్గొన్నారు.



తలకొండపల్లిలో స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



పూజలో మధుసూదన్‌రెడ్డి, తదితరులు

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

షాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచన్‌పల్లి కట్టమైసమ్మ ఆలయం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. సోమవారం అమ్మవారిని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి, మహేందర్‌గౌడ్, సుభాష్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

పల్లెల్లో సందడి!

(ఐదో పేజీ తరువాయి)

సమాచారం లేకుండా సెలవులు తీసుకుంటే చట్టపరమైన తీసుకుంటామని హెచ్చరించింది.

గుర్తులు ఖరారు

ఇప్పటికే వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఓటర్ల జాబితా సవరణ పూర్తి చేశారు. అలాగే ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు వీటికి అనుగుణంగా బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. సిబ్బంది నియామకాలు సైతం చేపట్టారు. అలాగే వారితో క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికలకు గుర్తులు కూడా ఖరారు చేశారు. సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి 30, వార్డు సభ్యులకు 20 గుర్తుల చొప్పున ఖరారు చేశారు. ఈ సారి బీసీలకు జనాభా ఆదారంగా స్థానాలు పెంచుతామని ప్రభుత్వం ప్రకటించడంతో ఇప్పటి నుంచే రాజకీయ నేతలు ఆరా తీస్తున్నారు. వాస్తవానికి గత జనవరి నెలాఖరు నాటికే పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు కొలువు తీరాల్సి ఉంది. అయితే లోక్‌సభ ఎన్నికల కారణంగా పంచాయతీ ఎన్నికలు వాయిదా వేసి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన తీసుకువచ్చారు. పంచాయతీ ఎన్నికలు ముగిసిన తరువాత జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు కూడా నిర్వహించాలని సర్కార్ భావిస్తోంది.

మూడు విడతల్లో ఎన్నికలు

పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం గతంలోనే అధికార ప్రకటన చేసింది. పంచాయతీ ఎన్నికల్లో 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. అంతకు మించి ఓటర్లు ఉంటే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. 200 మంది వరకు ఓటర్లు ఉన్న చోట ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి ఉంటారు. అలాగే 201 నుంచి 400 ఓట్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 ఉన్న చోట ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీల్లో కూడా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.



అధికార పార్టీకి సవాల్

ఈ ఎన్నికలు అధికార కాంగ్రెస్‌కు సవాల్‌గా మారాయి. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పార్టీ బలపడలేదు. తరుచూ ఏదో అంశాలపై ప్రతిపక్షాలు చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలు అధికార కాంగ్రెస్‌కు చికాకు తెప్పిస్తోంది. స్థానిక ఎన్నికల్లో పార్టీల గుర్తులతో సంబంధం లేకున్నా కేడర్‌ను గెలిపించుకునేందుకు ఆయా రాజకీయ పార్టీలు పోటీపడుతుంటాయనేది తెలిసిందే. ముఖ్యంగా పంచాయతీ ఎన్నికల్లో 90శాతానికిపైగా స్థానాలు గెలుచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహరచన చేస్తోంది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలో మాత్రమే కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో పూర్తిస్థాయిలో విజయం సాధించింది. మళ్లీ ఇపుడు కాంగ్రెస్ పూర్వవైభం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇటీవల మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150 వార్షికోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రసంగం చేశారు. వచ్చే స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు సీఎం నేరుగా చెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మూడు జిల్లాల్లో ఓటర్ల వివరాలు

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
రంగారెడ్డి	3,99,404	3,95,216	33	7,94,653
మేడ్చల్	32,402	31,992	03	64,397
వికారాబాద్	3,32,038	3,39,885	17	6,72,940

బీఆర్‌ఎస్, బీజేపీల ముమ్మర కసరత్తు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతుభరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని పార్టీ నాయకత్వం ఇప్పటికే కేడర్‌కు ఆదేశాలు జారీ చేసింది. రేషన్‌కార్డులు, ఇళ్ల వంటి విషయాల్లో ఎవరో ఆందోళన చెందకుండా అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరుస్తామనే హామీని ఇవ్వాలని ఆదేశించింది. ఇదిలా ఉంటే ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీలు కూడా పంచాయతీ పోరుకు పూర్తి స్థాయిలో రెడీ అవుతున్నాయి. నగర శివార్లలో బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు మంచి కేడర్ ఉంది. దీంతో ఈ స్థానాలను తిరిగి మళ్లీ కాపాడుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరుచూ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఏదో చోట ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరో వైపు బీజేపీ కూడా క్షేత్రస్థాయిలో కేడర్‌ను సమయాత్తం చేస్తోంది. రాష్ట్ర, జిల్లా నేతలు ఉమ్మడి జిల్లాలో పర్యటించి సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు.

నిధులు కేటాయించకపోవడం శోచనీయం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ వరకు చేపట్టే మెట్రో రైలు విస్తరణకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటం శోచనీయమని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివశంకర్ ముదిరాజ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం ప్రభుత్వం నిధులు కేటాయించకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం బీజేపీ పాలిత ప్రాంతాలకు, ఎన్నికల జరగనున్న రాష్ట్రాలకు నిధులు కేటాయించిందన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా ఎలాంటి నిధులు తీసుకురాలేక పోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చేపడుతున్న అభివృద్ధి పనులకు అడ్డంకులు వేయటానికే కేంద్రం కుట్ర పూరితంగా వ్యవహరించిదని ఆరోపించారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పాపిశెట్టి రాము

టీఎస్‌యూ క్యాలెండర్ ఆవిష్కరణ

ఆమనగల్లు , ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టూడెంట్ యూనియన్(టీఎస్‌యూ) క్యాలెండర్‌ను సోమవారం మండల పరిషత్ ఆవరణలో ఆవిష్కరించారు. ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, టీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కట్ట వెంకటేశ్ కార్యక్రమానికి హాజరై క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సోషలిస్టు విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ జంతుక శంకర్, నాయకులు నాగరాజు, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుపై నిలదీస్తాం

» కేసులకు భయపడేది లేదు

» మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ అంటే ఒక చరిత్ర అని, ఈ విషయం తెలంగాణలో అందరికీ తెలుసు అని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం పరిగిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ గురించి మాట్లాడే అర్హత సీఎం రేవంత్‌రెడ్డికి, పరిగి ఎమ్మెల్యేకు గానీ లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతిపక్షంగా కోరుతున్నామన్నారు. కానీ ఉద్దేశపూర్వకంగా విమర్శించడం లేదన్నారు. కులకచర్ల మండలం దాస్యానాయక్‌తండాలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ పార్టీ కార్యక్రమం కాదని, తండావాసులు ఏర్పాటు చేసిన కార్యక్రమం అని తెలిపారు. పిలిస్తేనే కేటీఆర్‌తో పాటు వెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాజకీయం చేయడం తగదని కాదన్నారు. అయితే ప్రభుత్వ హామీలపై, వైఫల్యాలపై ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. అధికార అహంకారంతో కేసులు పెడతామంటే భయపడేది లేదని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన పోరాడి జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏడాది పాలనలోనే విఫలమైందన్నారు. వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఎజెండా అని తెలిపారు. సమావేశంలో పరిగి మాజీ ఎంపీపీ అరవింద్ రావు, ఏఎంసీ మాజీ చైర్మర్ సురేందర్, మునిసిపల్ మాజీ చైర్మన్ అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, రైతుబంధు మండల మాజీ కో-ఆర్డినేటర్ ఎం.రాజేందర్, నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఫోరం కన్వీనర్ ఫిరంగి వెంకట్‌రాంరెడ్డి, మౌలానా, పి.హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి



అవార్డు అందుకున్న శ్రీదేవితో పాటు గీతావాహిని సభ్యులు

అవార్డు ప్రదానం

వికారాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రిఫ్లెక్షన్ చానెల్ సనాతన కాంక్లేవ్ 2025 అవార్డును వికారాబాద్‌కు చెందిన గీతా వాహిని సంస్థ అధ్యక్షురాలు శ్రీదేవి అందుకున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ అందించారు. క్షేత్రస్థాయిలో భగవద్గీతను ప్రజల్లోకి తీసుకు వెళ్లినందుకు గాను ఈ అవార్డు వరించింది. కార్య క్రమంలో ఉపాధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి జయశ్రీ, కోశాధికారి వరలక్ష్మి, సభ్యులు మధురి, ఝాన్సీరాణి, కరుణ, సరళ, లక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్లకు పెద్దపీట

కందుకూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేసేలా ఉందని.. పేదలను ఇంకా పేదలుగా చేసేలా ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దుబ్బాక రాంచందర్ అన్నారు. సోమవారం ఆ పార్టీ మండల శాఖ కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.



కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మాదిగల ఐక్యతను చాటాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేసి మాదిగల ఐక్యతను చాటాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కంబాలపల్లి రవి పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి రాష్ట్రంలో వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే 'లక్ష డప్పులు, వేల గొంతులు' కార్యక్రమం విజయవంతంపై చర్చించారు. కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, నిరంజన్, జంగయ్య, భద్ర, శ్రీశైలం, వీరేశ్, రమేశ్, కుమార్, రాములు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న కంబాలపల్లి రవి, నాయకులు

అ'పూర్వ' సమ్మేళనం

కడ్తాల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1985-86 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆమనగల్లు మండలం అయ్యసాగర్ క్షేత్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బాల్య మిత్రులంతా పాల్గొని ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వీరారెడ్డి, తిరుమలేశ్, వేణు, కృష్ణవేణి, రామచంద్రయ్య, యాదయ్య, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వనజ, తేజ, తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీ షురూ

హాజరైన 35 టీంలు

మూడు రోజుల పాటు కొనసాగింపు

ఆమనగల్లు , ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండలం శెట్టిపల్లిలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 4వ ఓపెన్ టు ఆల్ వాలీబాల్ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 30 టీంలు హాజరయ్యాయి. మూడు రోజుల పాటు టోర్నమెంట్ నిర్వహణకు నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర కాలుష్య నియంత్ర మండలి సభ్యుడు బాలాజీ సింగ్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యంలతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పోటీలను ప్రారంభించారు. ముందుగా వివేకా విద్యాభారతి పాఠశాల విద్యార్థుల ఎన్‌సీసీ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అలాగే మార్చ్ పాస్ట్ నిర్వహించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.20,116, ద్వితీయ బహుమతి రూ.10,116లు, తృతీయ బహుమతి రూ.5,116లతో పాటు షీల్డ్‌లను అందజేస్తామని గోదాదేవి సత్యంలు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో అత్యుత్తమ క్రీడా పాలసీ అమలుకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ మహమూద్, ప్రసాద్, మల్లేశ్, సురేశ్, ఆలయ చైర్మన్ సింగం శ్రీనివాస్, నాయకులు పోనుగోటి అర్జున్‌రావు, వెంకటయ్య, భాస్కర్‌రావు, దేవేందర్ రావు, జగన్మోహన్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



వాలీబాల్ పోటీలో తలపడుతున్న జట్లు

వైభవంగా వసంత పంచమి

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

యాచారం/చేవెళ్ల/షాబాద్/షాద్‌నగర్‌రూరల్/ఆమనగల్లు/మహేశ్వరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాలలు, ఆలయాల్లో విద్యార్థులు, చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామంలో నిర్వహించిన వసంత పంచమి వేడుకల్లో చిన్నారులతో హంపి విరూపాక్ష విద్యారణ్యభారతి స్వామి అక్షరాభ్యాసం చేయించారు.



షాబాద్: నాగర్‌గూడలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు



చేవెళ్ల: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్‌లో ప్రత్యేక వేషధారణలో చిన్నారుల నృత్యం



ఆమనగల్లులో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



మొయినాబాద్: పెద్దమంగళవారంలో విద్యార్థులకు అక్షరాభ్యాసం

యాచారం: అక్షరాభ్యాసం చేయిస్తున్న శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి





మహేశ్వరం: తుక్కుగూడలో పూజలో ఎమ్మెల్యే సబితారెడ్డి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే గన్‌మన్ మృతి



శ్రీనివాస్(ఫైల్)

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గన్‌మన్ శ్రీనివాస్ మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధి బుల్కాపూర్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ముత్తంగి శ్రీనివాస్(31) ఆదివారం రాత్రి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం వెలిమెలలో ఉండే తన అమ్మమ్మ వద్దకు పని నిమిత్తం బైక్‌పై బయల్దేరాడు. అర్ధరాత్రి వెలిమల తండా వద్ద బైక్‌కు అడవిపంది ఢీకొని శ్రీనివాస్ కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాస్ వికారాబాద్ జిల్లాలో ఆర్మ్‌డ్ రిజర్వు కానిస్టేబుల్‌గా ఉండగా ప్రభుత్వం అతన్ని ఎమ్మెల్యే యాదయ్యకు గన్‌మన్‌గా కేటాయించింది. నాలుగేళ్లుగా ఎమ్మెల్యేకు గన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బీడీఎల్ భానూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యాదయ్య సోమవారం పటాన్‌చెరు వెళ్లారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని శ్రీనివాస్ స్వగ్రామం బుల్కాపూర్‌నకు తరలించారు. అక్కడ కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.50వేలు తక్షణ సాయం అందజేశారు. గన్‌మ్యాన్ శ్రీనివాస్ సోదరుడు బుచ్చిరాజు సైతం కానిస్టేబుల్. కాగా ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్ అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో నిర్వహించారు.

మద్యం మత్తులో గొడవ: పలువురికి గాయాలు

నందిగామ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిట్టలగూడ శివారులో మద్యం మత్తులో ఇరువర్గాల మధ్య గొడవ జరిగి పలువురికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం.. పిట్టలగూడలో విందులో పాల్గొనడానికి నందిగామకు చెందిన కుమ్మరి కృష్ణ, బుర్రి నరేందర్‌రెడ్డి మిత్రులతో వెళ్లారు. సమీపంలోని వెంచర్‌లో పార్టీ ఏర్పాటు చేశారు. అక్కడ కారు పార్కింగ్ విషయంలో పిట్టలగూడ గ్రామానికి చెందిన శ్రీశైలం, మహేందర్, ప్రవీణ్, ప్రమోద్, కృష్ణ కుమ్మరి కృష్ణతో గొడవపడ్డారు. గొడవ కాస్తా దాడుల వరకు వెళ్లింది. పిట్టలగూడ గ్రామ యువకుల దాడిలో కుమ్మరి కృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కుమ్మరి కృష్ణ మిత్రులు పిట్టలగూడ గ్రామానికి వచ్చి గ్రామ యువకులపై దాడి చేశారని గ్రామస్తులు తెలిపారు. కృష్ణ ఫిర్యాదు మేరకు శ్రీశైలం, మహేందర్, ప్రవీణ్, ప్రమోద్, కృష్ణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

యాచారం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్కూటీని వెనుకనుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 31న యాచారం మండల కేంద్రంలో రాత్రి ఇబ్రహీంపట్నం నుంచి యాచారం వైపు స్కూటీపై వస్తున్న బడంగ్‌పేట మున్సిపాలిటీ అల్మాస్‌గూడకు చెందిన రాజునాయక్(45)ను వెనకనుంచి వేగంగా వస్తున్న స్విఫ్ట్ కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ అతడిని పోలీసులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

క్రూయిజర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

యాచారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చౌదర్‌పల్లి గేటు సమీపంలో ఆదివారం రాత్రి లూనాను క్రూయిజర్ ఢీ కొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన హుస్సేన్, షేక్‌అబ్దుల్‌సత్తర్ లూనాలో పెట్రోల్ పంపులో పెట్రోల్ పోసుకొని తమ గ్రామం వైపు వస్తున్నారు. గున్‌గల్ వైపు నుంచి యాచారం వస్తున్న లూనాను క్రూయిజర్ ఢీ కొట్టింది. ఈఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు చికిత్స నిమిత్తం ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

'మోకిల లక్ష్మీనర్సింహ త్రిశతి' ఆవిష్కరణ

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా మోకిలలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. మోకిల లక్ష్మీ నర్సింహ త్రిశతి పుస్తకాన్ని ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ములుగు అంజయ్య, మల్లారెడ్డి, మనోహర్‌రెడ్డి, నర్సింహులు, మోహన్‌రెడ్డి, లక్ష్మయ్య ఉన్నారు.

కాంగ్రెస్‌కు పవన్‌కుమార్ గౌడ్ రాజీనామా

శంషాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపాలిటీలోని మధురానగర్‌కు చెందిన పవన్‌కుమార్‌గౌడ్ సోమవారం కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. బీఆర్ఎస్‌లో చురుకైన కార్యకర్తగా ఉన్న పవన్‌కుమార్‌గౌడ్ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు వ్యక్తిగత కారణాలతో కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్తులు ఆందోళన ఉధృతం చేశారు. తొమ్మిది గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 94వ రోజుకు చేరాయి. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం ఏర్పాటుకు ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ ఆంజనేయులు, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

ఆమనగల్లు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో ఆమనగల్లు విద్యుత్‌సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆమనగల్లు విద్యుత్ శాఖ ఏడీఈ బాలకృష్ణ తెలిపారు. మెరుగైన విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేసేందుకు రాజేంద్రనగర్ ఎస్ఈ శ్రీరామ్మోహన్ అధ్యక్షతన మంగళవారం కందుకూరు డివిజన్ కార్యాలయంలో సాయంత్రం నాలుగు గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని కందుకూరు, మహేశ్వరం, పహడీషరీఫ్, బాలాపూర్, ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల విద్యుత్ వినియోగదారులు పాల్గొని సలహాలు ఇవ్వాలని కోరారు.

ఓటరు జాబితా విడుదల

యాచారం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం సోమవారం యాచారం ఎంపీడీవో నరేందర్ రెడ్డి ఓటరు అనుబంధ జాబితాను విడుదల చేశారు. మండలంలోని 24 పంచాయతీల కార్యాలయాల్లో నోటీస్ బోర్డుపై అనుబంధ ఓటరు జాబితాను ఏర్పాటు చేశారు.

వైద్య శిబిరానికి స్పందన

యాచారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లిలో సోమవారం బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన నీలాద్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. 230 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులందించారు. రోగులకు పరీక్షలు చేసి మందులు అందించిన 20మంది వైద్యులకు మాజీ ఉపసర్పంచ్ జగన్ ధన్యవాదాలు తెలిపారు.

గమనిక

ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా, "రాయల్ పామ్స్ వెల్ఫేర్ & కల్చరల్ అసోసియేషన్" రిజిస్ట్రర్ నంబరు 1186 ఆఫ్ 2024 రద్దుచేయాలని నిర్ణయించబడినది. కనుక తెలుపబడినది.

గ్రామాల అభివృద్ధిలో రాజకీయాలొద్దు



మక్తమాదారంలో ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి, దైవ కార్యక్రమాల్లో రాజకీయాలకు చోటు ఉండొద్దని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. దాతృత్వం, సేవా భావం సమాజంలో వ్యక్తి ప్రతిష్ట పెంపు, కీర్తికి దోహద పడుతాయని పేర్కొన్నారు. మండలంలోని మక్తమాదారంలో వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయానికి ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతానర్సింహ, యాట జంగయ్య, పార్వతమ్మ దంపతుల ఆధ్వర్యంలో రూ.28 లక్షలతో నిర్మించిన ముఖ ద్వారాన్ని సోమవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ముఖద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, మాజీ ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, బీచ్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్లు శ్రీనివాస్, చేగూరి వెంకటేశ్, అర్చకులు ఆదిత్యాచార్యులు, వెంకటరంగాచార్యులు, మాజీ ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, నాయకులు బాల్‌రాజ్, నర్సింహగౌడ్, నారాయణ, చంద్రయ్య, గోపాల్, యాదగిరి, మల్లేశ్, బాల్‌రాజ్, చెన్నయ్య, రమేశ్, యాదయ్య, నింగ్యారి యాదగిరి, షాబోద్దీన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతు భరోసా ఇవ్వాలి



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రైతు భరోసా ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతుభరోసా నిధులు ఒకే గ్రామానికి ఇవ్వడం సరికాదని, అరులందరికీ అందజేయాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, రైతుల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వెంకట్‌రెడ్డి, బందిరెడ్డి, గౌతం, రైతులు భీమయ్య, సందీప్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన సుంకిరెడ్డి



బీర్ల ఐలయ్యను సన్మానిస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను సోమవారం టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. టాస్క్ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులు, విద్యార్థులకు ఇస్తున్న నైపుణ్య శిక్షణను, కార్యక్రమాలను వివరించినట్లు తెలిపారు.

కొత్తూర్ ఎంపీటీసీ స్థానాల జాబితా విడుదల



నోటిఫికేషన్‌ను నోటీస్ బోర్డులో అతికిస్తున్న ఎంపీడీవో డాక్టర్ అరుంధతి, సిబ్బంది

కొత్తూర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీల తుది జాబితాను జిల్లా ఎలక్షన్ అథారిటీ విడుదల చేసిందని ఎంపీడీవో డాక్టర్ అరుంధతి సోమవారం పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీటీసీ స్థానాల నోటిఫికేషన్‌ను నోటీస్ బోర్డులో అతికించారు. కొత్తూర్ నూతనంగా మున్సిపాలిటీ కావడంతో ఐదు ఎంపీటీసీ స్థానాలను రద్దు చేశారు. మండలంలో మొత్తం పది స్థానాలకుగాను ఐదు స్థానాలు రద్దయ్యాయి. కొత్తగా తీగాపూర్ ఎంపీటీసీ స్థానాన్ని ఎంపిక చేశారు. అక్కడి నుంచి వచ్చిన అభ్యంతరాలు ఎలక్షన్ అథారిటీ ఆంగీకరించలేదని ఎంపీడీవో తెలిపారు. మండలంలో మొత్తం ఆరు స్థానాలను గుర్తించినట్లు తెలిపారు. గుడూర్ ఎంపీటీసీ స్థానంలో గుడూర్, మక్తగూడ, మల్లాపూర్‌తండా, తీగాపూర్‌లో తీగాపూర్, మల్లాపూర్, పెంజర్లలో పెంజర్ల, కొడిచర్లలో కొడిచర్ల, కొడిచర్లతండా, ఎస్‌బీ పల్లి, ఇన్ముల్‌నర్వలో ఇన్ముల్‌నర్వ, సిద్దాపూర్‌లో సిద్దాపూర్, ఏనుగుమడుగులతండాలు ఉన్నాయని పేర్కొన్నారు.

లక్ష డప్పుల ప్రదర్శనను విజయవంతం చేయాలి

యాచారం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరుతూ ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమానికి మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మూలి మహేష్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష డప్పులు వాయించి వర్గీకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జోగు అంజయ్య, బోడ ముత్యాలు, జోగు కృష్ణ తదితరులున్నారు.

పీహెచ్‌సీ వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలి



గర్భిణులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న వేదవతి

కొత్తూర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలని స్థానిక నాని మహిళా సేవా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ వేదవతి డిమాండ్ చేశారు. గర్భిణులతో కలిసి పీహెచ్‌సీ వద్ద సోమవారం నిరసన తెలిపారు. కొత్తూర్ పీహెచ్‌సీ మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉందని, ఈ రూట్‌లో హైద్రాబాద్-జేపీ దర్గాకు వెళ్లే బస్సులు చాకలిదానిగుట్టతండా బస్టాప్ వద్ద నిలుపుతుండడంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించి సమస్యను పరిష్కారించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట




అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం

చేవెళ్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. సోమవారం చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్‌లో ఎంపీ లాడ్స్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, సామ మాణిక్యరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవుని శర్వలింగం, మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, జిల్లా యువ నాయకుడు డాక్టర్ మాలారి వైభవ్‌రెడ్డి, నాయకులు అడ్డెట్ల శ్రీనివాస్, మల్లేష్, ఇంద్రసేనారెడ్డి, శివ, జైపాల్‌గౌడ్, మాదవరెడ్డి, మాణిక్యరెడ్డి, నరేందర్‌గౌడ్, హుమర్, మోసిన్ ఉన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి

ఆమనగల్లు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యమని మాజీ ఎంపీపీ అనితావిజయ్ అన్నారు. మండలంలోని మేడిగడ్డ తండాలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో రూ.7 లక్షలతో నూతనంగా చేపట్టే మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సోమవారం కేఎన్ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్‌రాథోడ్‌తో కలిసి భూమి పూజచేశారు. మేడిగడ్డ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం తండాలు, గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో వినోద, ఏఈ శరత్, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, నాయకులు పరమేశ్, మల్లేశ్ నాయక్, రాంజా, గేమ్యా, పాండు, మల్యా, శ్యామ్, కిషన్, దేశ్యా, రాజు, లాలు, సిద్దు, నరేశ్, కౌశిక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న కాంగ్రెస్ కేశంపేట మండల అధ్యక్షుడు వీరేశ్

కేశంపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందని, ఏడాదిలోనే కేశంపేట మండలంలో రూ.6.89కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేటలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. షాద్‌నగర్ ఎమ్మెల్యేగా వీర్లపల్లి శంకర్ సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించారని తెలిపారు. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నరని పేర్కొన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు నాగిళ్ల భాస్కర్, రూప్లానాయక్, సురేష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, గిరిధర్ యాదవ్, రాజేందర్ రెడ్డి, గోపాల్ ముదిరాజ్, కోడూరు రాములు, సురేష్ మాదిగ, భీమయ్య, రావుల పెంటయ్య, హరీశ్వర్ రెడ్డి, మనోహర్ గౌడ్, ఉస్మాన్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

చేవెళ్ల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని కరాటే మస్టర్ కృష్ణ అన్నారు. వికారాబాద్‌లో మాస్టర్ జావన్ చోటోకాన్ కరటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఇందులో చేవెళ్ల మండలం నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పర్పుల్ బెల్ట్ విభాగంలో జశ్వంత్‌కుమార్ గోల్డ్‌మెడల్ సాధించగా రిజ్వానా బేగం, ఎండీ ఆయన్, సాయి, గణేశ్, దేవరాజ్, లోకేష్, నగశివచారి, మణిదీక్షిత్, సిద్దు, అక్బర్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఆయా విద్యార్థులకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బహుమతులు అందించినట్లు కృష్ణ తెలిపారు.

అభివృద్ధిపథంలో శంకర్‌పల్లి మున్సిపాలిటీ

(5వ పేజీ తరువాయి)

విరివిగా అంతర్గత డ్రెయిన్లు, వైకుంఠధామం, పార్కులు, నర్సరీలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం తదితర పనులు పూర్తి కాగా.. మరి కొన్ని కొనసాగుతున్నాయి.

'అమృత్'తో తాగునీటి సమస్యకు చెక్

అమృత్ 2.0 కింద కేంద్ర, రాష్ట్రాల నిధులు రూ.32.47కోట్లతో శంకర్‌పల్లిలో తాగునీటి సమస్యకు చెక్ పడనుంది. నీటి ఎద్దడి తీర్చేందుకు పట్టణంలో 6 ఓవర్‌హెడ్ ట్యాంకులతో పాటు అన్ని వార్డుల్లో 37.27కి.మీల పరిధిలో పైపులైన్ వేసే పనులు చేపడుతారు. దీంతో ఏళ్లుగా పీడిస్తున్న తాగునీటి సమస్య తీరనుంది.

పార్కుల్లో సేదదీరుతున్న స్థానికులు

శంకర్‌పల్లిలోని వివేకానందనగర్‌లోని పార్క్‌ను అభివృద్ధి చేశారు. దీంతో వృద్ధులకు, పిల్లలకు ఉపయోగకరంగా ఉంది. పిల్లలు ఆడుకునేందుకు క్రీడా పరికరాలు, వృద్ధులు, మధ్య వయస్కులు, యువకుల కొరకు వాకింగ్ ట్రాక్ నిర్మించారు. పార్కులో పచ్చని చెట్లు పెంచడంతో పాటు ల్యాన్ ఏర్పాటు చేయడం కాలనీ వాసులను ఆకట్టుకుంటోంది.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశా..



పదవిలో ఉన్న ఐదేళ్లపాటు అధికారులు, పాలకవర్గం సహకారంతో అభివృద్ధి పనులను ముమ్మరంగా చేపట్టాం. శంకర్ పల్లిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిరంతరం పని చేశాం. రూ.92 కోట్లకుపైగా నిధులతో పనులు చేశాం. కొత్త కాలనీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నాం. ఐదేళ్ల ప్రజాసేవ నాకు పూర్తి సంతృప్తినిచ్చింది.

- విజయలక్ష్మీప్రవీణ్‌కుమార్,
మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, శంకర్‌పల్లి

పేదలకు ఇళ్ల స్థలాలు చూపించాలి

కందుకూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఇచ్చిన సర్టిఫికెట్ల ఆధారంగా పొజిషన్ చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుబ్బాక రాంచందర్ అన్నారు. సోమవారం ఆ పార్టీ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్‌తో కలిసి ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి బాధితులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 16 ఏళ్ల క్రితం మండల కేంద్రంలోని 788సర్వే నంబర్ లో183మందికి 60గజాల చొప్పున పట్టా సర్టిఫెట్లు ఇచ్చారని, సంవత్సరం క్రితం కందుకూరు సర్వే నంబర్ 107 సర్వే నంబర్‌లో 330మందికి పట్టా సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. కాని, వారికి నేటికీ స్థలం చూపలేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, సిద్దం అంజయ్య, సీఐటీయూ నాయకులు గాదె సత్యం, బాధితులు శేఖర్, అరుణ, రాధ, రాజమణి, నజీమాబేగం, జంగమ్మ, ఇందిరమ్మ, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కడ్తాల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాన్గుమర్ల తండాకు చెందిన నేనావత్ రవి అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం బీజేపీ రాష్ట్ర గిరిజనమోర్చ కార్యవర్గ సభ్యుడు బాణావత్ శంకర్‌నాయక్ సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు తక్షిణసాయం అందజేశారు. నాయకులు శ్రీనునాయక్, మునేశ్, జగన్, పాండు, గణేశ్, దేశ్య, దేవులా ఉన్నారు.